## బతుకమ్మలతో సీఆర్టీల నిరసన

### భద్రాచలంలో 9వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

భద్రాచలం, డిసెంబర్ 28 : గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీలు) తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం బతుకమ్మలతో నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రాం, ప్రధాన కార్యదర్శి వీరన్నల ఆధ్వర్యంలో 9వ రోజు దీక్షల్లో భాగంగా మహిళా సీఆర్టీలు బతుకమ్మలు ఎత్తుకుని ఆడిపాడి సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. సమ్మెకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రమణయ్య, మిరియాల నర్సింహారావు, రామారావు, శ్రీనివాస్‌లు మద్దతు తెలిపారు. తమ 8 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే నూతన సంవత్సరంలో ఆమరణ దీక్షకు కూడా వెనుకాడబోమని సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివనాయక్, ఐటీడీఏ ఇన్‌చార్జి రాజేశ్, సీనియర్ నాయకులు నరేశ్, వీరన్న, రవి, రూప, సుజాత, నిర్మల, సునీత, వెంకటరమణ, రాము, బుచ్చయ్య, లక్ష్మణ్, నర్సింహారావు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం ఐటీడీఏ ఎదుట బతుకమ్మలతో నిరసన తెలుపుతున్న సీఆర్టీలు

# ఓ వైపు జబ్బు..

# మరో వైపు గబ్బు

- భద్రాద్రి పెద్దాసుపత్రిలో అడుగడుగునా దుర్గంధం
- సెప్టిక్ ట్యాంకు నుంచి బయటికొస్తున్న మురుగు నీరు
- వైద్యశాలలో కంపుకొడుతున్న మూత్రశాలలు
- ఆసుపత్రి ఆవరణ మొత్తం అపరిశుభ్రమే..
- హెచ్చరికలతోనే సరా? ఆచరణ ఎప్పుడు మరి?


ఆసుపత్రిలో మరుగుదొడ్ల నుంచి బయటకొస్తున్న మురుగునీరు


కంపు కొడుతున్న మూత్రశాలలు


తాగునీరు రాని మంచినీటి ట్యాంకు



కనీస సౌకర్యాలు లేని జిల్లా ఆసుపత్రి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : పేదలకు వైద్యం అందించాల్సిన సర్కారు ఆసుపత్రిలో అదే రోగుల ముక్కులు పగిలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ వైపు జబ్బు తగ్గించుకుందామని ఆసుపత్రికి వస్తే.. ఇక్కడే ముక్కు పుటాలం ముక్కలయ్యేంత గబ్బు కొడుతోంది. దీంతో రోగాలను నయం చేయించుందామని వైద్యశాలకు వచ్చిన రోగులు, వారికి తోడుగా వచ్చిన సహాయకులు.. మరికొన్ని రోగాల భారిన పడుతున్నారు. సాక్షాత్తూ భద్రాద్రి జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రిలోనే ఇంతలా దుర్గంధం వెదజల్లుతూ గబ్బు కొడుతుండడంతో రోగులు, వారి సహాయకులు అడుగడుగునా ముక్కులు మూసుకుంటూ వచ్చిపోతున్నారు.

కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో పర్యవేక్షకులు మారినా ఆసుపత్రి తలరాత మాత్రం మారడం లేదు. కలెక్టర్లు తనిఖీలు చేసినా వైద్యుల పనితీరులో మార్పు రావడం లేదు. ఇప్పటికే మందులు సరిపడా లేక, వైద్యులు తగినంతమంది లేక పేద రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక ఆసుపత్రి ఆవరణ కూడా దుర్గంధం వెదజల్లుతుండడంతో రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. కాలువల ద్వారా పోవాల్సిన మురుగు నీరు ఆసుపత్రి ఆవరణలో నిలిచి ఉంటోంది. తాగునీరు ట్యాంకు పనిచేయడం లేదు. మూత్రశాలలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

### సెప్టిక్ ట్యాంకు నుంచి మురుగు నీరు బయటకు..

బెడ్లు పెరిగినా ఆసుపత్రి పరిశుభ్రతలో మాత్రం మార్పు లేదు. నీళ్ల ట్యాంకులో మంచినీళ్లు మచ్చుకైనా లేవు. ఇక మరుగుదొడ్ల నుంచి వచ్చే మురునీరు పోవడానికి దారి కూడా లేదు. దీంతో ఆసుపత్రి ఆవరణ అంతా మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో సెప్టిక్ ట్యాంకులు కూడా నిండి పొర్లుతున్నాయి. తాము ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఆసుపత్రి వైద్యులు పట్టించుకున్న పాపానపోవడం లేదని స్థానికులు, రోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొందరు ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు. అయినా స్పందన రాలేదు.

### హెచ్చరికలతోనే సరా..?

అసలే వైద్యులు అంతంత మాత్రం. మందులు కూడా సరిపడా లేవు. ప్రిస్కిప్షన్ తీసుకొని వస్తే సగానికి సగం మందులు బయటే తెచ్చుకోమని సలహా ఇస్తారు. చివరికి శుభ్రతపైనైనా దృష్టిపెడతారా.. అంటే అదీ లేదు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇటీవల ఈ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు రిజిస్టర్‌లో సంతకాలు కూడా పెట్టడం లేదని తేలింది. రెండు మూడు గంటలపాటు ఆసుపత్రిని పరిశీలించిన ఆయన.. ఇక్కడి వైద్యుల పనితీరు, అపరిశుభ్రత వంటి అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కూడా పట్టించుకోకపోవడంతో స్వయంగా ఆయనే ఇక్కడి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కూడా రెండుసార్లు ఈ ఆసుపత్రిని తనిఖీ చేశారు. మెరుగైన వైద్య సేవలందించకపోతే ఊరుకునేది లేదంటూ వైద్యులపైనా, పర్యవేక్షకులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అంతలా హెచ్చరించినా వారిలో ఇసుమంతైనా మార్పు రాలేదు. దీంతో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంలా అయింది కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రి పరిస్థితి.

### మురుగు నీరు రోజుల తరబడి పారుతోంది..



మరుగుదొడ్లలో ఉండే మురుగంతా బయటకొస్తోంది. అది ఆసుపత్రి ఆవరణలో రోజుల తరబడి పారుతోంది. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఈ సమస్య గురించి కలెక్టర్‌కు చెప్పాం. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోవట్లేదు. ఈ ఆస్పత్రిలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది.

–శ్రావణబోయిన నర్సయ్య, స్థానికుడు

## ఖమ్మం జిల్లాలో పెరిగిన నేరాలు

- గతేడాది 7,667, ఈ ఏడాది 8,873 కేసులు నమోదు
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడి


వార్షిక క్రైం నివేదికను విడుదల చేస్తున్న పోలీస్ అధికారులు

ఖమ్మం, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 16 శాతం పెరిగాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జిల్లా క్రైం వార్షిక నివేదికను ఉన్నతాధికారులతో కలిసి శనివారం ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో సీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 చివరిలో శాసనసభ ఎన్నికలు, 2024లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ఈసీ ఆదేశాల మేరకు పలు దాడులు చేసి అనుమానితులపై కేసులు నమోదు చేశామన్నారు. గత ఏడాది 7,667 కేసులు నమోదు అవ్వగా ఈ ఏడాది 2024 డిసెంబర్ 28వ తేదీ వరకు 8,873 కేసులు నమోదుకావడంతో జిల్లావ్యాప్తంగా 16శాతం క్రైమ్ పెరిగిందని తెలిపారు. 336 సైబర్ కేసులు నమోదు చేశామని, ఈ కేసుల్లో రూ.34,92,88,973 ప్రజలు నష్టపోయారని వాటిలో రూ.24,292, 363 అకౌంట్లలో డబ్బులను హోల్డ్‌లో పెట్టామని, రు.52,13,310 రికవరీ చేశామని వివరించారు. 27శాతం మిస్సింగ్ కేసులు, 41.7 శాతం కిడ్నాపింగ్ కేసులు పెరిగాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు 785 జరిగాయని వాటిలో 281 మరణాలు సంభవించాయని తెలిపారు. 700 దొంగతనాల కేసులు నమోదు చేశామని వాటి ద్వారా ప్రజలు రూ.5,58,17,584 నష్టపోయారని వాటిలో ఇప్పటివరకు రు.1,55,98,278 రికవరీ చేశామని తెలిపారు. కేసుల నమోదు, దర్యాప్తు, శిక్షలు పడే విషయంలో పోలీసు అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, శిక్షణ ఐపీఎస్ రుత్విక్, ఏసీపీలు రమణమూర్తి, సాంబరాజు, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, రహ్మాన్, రవీందర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

## మా టీచర్ల సమస్యలు పరిష్కరించరూ..

### చింతకాని కేజీబీవీ ఎదుట మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన


చింతకాని కేజీబీవీ ఎదుట ప్లకార్డులు పట్టుకొని మోకాళ్లపై కూర్చొని నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

మధిర(చింతకాని), డిసెంబర్ 28 : వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నందున మా టీచర్ల సమస్యలు పరిష్కరించి.. చదువులు చెప్పేలా చూడండి సీఎం సారూ.. అంటూ ఖమ్మం జిల్లా చింతకాని కేజీబీవీ ఎదుట విద్యార్థినులు ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చొని శనివారం వినూత్న నిరసన తెలిపారు. టీచర్ల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ తమకు బోధించే 16 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ నెల 12వ తేదీ నుంచి సమ్మె చేస్తుండడంతో బోధించే వారు లేక తరగతి గదుల్లో ఖాళీగా కూర్చుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నా సిలబస్ పూర్తి కాలేదని, ఇంటర్ ప్రాక్టికల్స్ ఎలా చేయాలో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, చదువులు సక్రమంగా జరిగేలా చూడాలని వేడుకున్నారు.

## తెల్లటోపీలు ధరించి నిరసన


తెల్లటోపీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 28 : సమగ్రశిక్ష ఉద్యోగులు నిరసనలో భాగంగా శనివారం తెల్లటోపీలు ధరించి ఖమ్మంలో మౌన ప్రదర్శన చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిపించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జాన్సీసౌజన్య, వీరస్వామి, అనిల్, నిర్మల, కృష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

- సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె తప్పదు
- తేల్చిచెప్పిన పంచాయతీ కార్మికులు
- ఖమ్మం ఉమ్మడిజిల్లాలో ముగిసిన టోకెన్ సమ్మె

## తాడోపేడో తేల్చుకుంటాం..


జూలూరుపాడు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి.. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి.. పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పంచాయతీ కార్మికులు ముక్తకంఠంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రెండోరోజు వారు నిర్వహించిన టోకెన్ సమ్మె ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముగిసింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాల్లో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చేనెల 4వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. భవిష్యత్‌లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య, విద్యుత్, నీటి సరఫరా పనుల్లో మల్టీపర్పస్ వర్కర్లుగా కార్మికులు పగలనకా రాత్రనకా వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. నెలనెలా వేతనాలు సరిగా అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని బాధను వ్యక్తంచేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

– నమస్తే నెట్‌వర్క్

## ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- సర్వే రిపోర్టు కోసం రూ.50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- 26న తహసీల్‌ను తనిఖీ చేసిన మంత్రి పొంగులేటి, 28న ఏసీబీ దాడి..


రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ సర్వేయర్ వెంకటరత్నం

దమ్మపేట రూరల్, డిసెంబర్ 28 : ఓ సర్వేయర్ భూమిని సర్వే చేసిన రిపోర్టు ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామ శివారులో మద్దినేని మమతకు 19.02 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనికి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం రాకపోవడంతో సుమారు రెండు నెలల క్రితం మమత దరఖాస్తు చేసుకుంది. అయితే పాస్‌బుక్ ఇచ్చేందుకు ముందుగా మండల సర్వేయర్ భూమిని సర్వే చేసి రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో సర్వేయర్ మెరుగు వెంకటరత్నం సర్వే చేసినా రిపోర్టు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడు. దీంతో రిపోర్టు కోసం మమత సోదరుడు మద్దినేని వెంకట్‌ను పలుమార్లు తిప్పించుకుంటూ రూ.1.5 లక్షలు లంచం డిమాండ్ చేసి.. రూ.50 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం వెంకట్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. వారు పన్నిన పథకం ప్రకారం.. సర్వేయర్‌కు రూ.50 వేలు ఇచ్చేందుకు శనివారం వెంకట్ ఫోన్ చేశాడు. జాతీయ రహదారిపై ఉన్న మందలపల్లి శివారు గాంధీనగరం ఇటుక బట్టీవద్ద రూ.50 వేలు నగదు తీసుకుంటుండగా అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు సర్వేయర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో రిమాండ్ చేస్తామని ఏసీబీ డీఎస్పీ రమేశ్ వివరించారు.

### 26న తహసీల్‌ను తనిఖీ చేసిన మంత్రి పొంగులేటి, 28న ఏసీబీ దాడి..

గతంలో ఎన్నడూ లేని విధంగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నెల 26న ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని ధరణి రిజిస్ట్రేషన్ రూమ్, ఎంఆర్ఐ–1 రూమ్‌లతోపాటు తహసీల్దార్ గదిలోని ఫైళ్లను తనిఖీ చేశారు. ఇటీవల రెవెన్యూ సేవలు పొందిన వారికి స్వయంగా ఫోన్లు చేసి పనుల్లో జాప్యం జరిగిందా? పనికి లంచం తీసుకుంటున్నారా? అని మంత్రి ఆరా తీశారు. ఈ క్రమంలోనే తాజాగా సర్వేయర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడం జిల్లాలో సంచలనంగా మారింది.

### పైస ముట్టందే సర్వే జరగదు..

సర్వేయర్ వెంకటరత్నం ఏసీబీకి పట్టుబడిన తర్వాత ఆయనపై ఉన్న ఆరోపణలు బహిర్గతమవుతున్నాయి. పైస ముట్టందే సర్వే జరగదని, రిపోర్టు ఇవ్వడని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో సర్వేకు వెళితే తీరొక్క విధంగా కొర్రీలు పెట్టి వేధించడం ఆయనకు పరిపాటి అని చెబుతున్నారు.

## రుణమాఫీ కోసం పోస్టుకార్డు ఉద్యమం

### తురకగూడెం నుంచి సీఎంకు ఉత్తరాలు పోస్టు


తురకగూడెంలో రుణమాఫీ చేయాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన రైతులు

కూసుమంచి, డిసెంబర్ 28 : అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు పోస్టు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, రైతులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారందరికీ రుణమాఫీ వర్తించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, పుసులూరి ఉపేందర్‌రావు, కన్నెబోయిన వీరబాబు, వెంకన్న, బుర్రా రజిత, ఉప్పమ్మ పాల్గొన్నారు.





మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616